# నమస్తే తెలంగాణ
# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 10 జూన్ 2024 | VIKARABAD


అవయవదానంపై

## అవగాహన రన్




అవయవదానంపై ఆదివారం నెక్లెస్‌రోడ్‌లో అవగాహన పరుగు నిర్వహించారు. సంజీవయ్య పార్కు నుంచి 10కే, 5కే రన్ సాగింది. మోహన్ ఫౌండేషన్ సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర, బ్రిల్స్ సీఈవో రామ్‌నరేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ 10కే రన్ రెండో ఎడిషన్ పేరిట రన్ ఫర్ ఆర్గాన్ అవేర్‌నెస్ పరుగులో పలువురు రన్నర్స్, వైద్యులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మరణించినా..అవయవదానం ద్వారా మరొకరికి జీవితాన్ని ఇచ్చి ఎంతోమంది ప్రాణాలు నిలుపవచ్చని పలువురు పేర్కొన్నారు. -బేగంపేట్, జూన్ 9






అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సెంటర్‌ను సందర్శించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక
వికారాబాద్ : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

# యూనిఫామ్ అందేనా..?

- బుధవారమే పాఠశాలల రీ ఓపెన్
- ఇప్పటివరకు 50 శాతం మాత్రమే పూర్తైన దుస్తుల తయారీ
- రంగారెడ్డి జిల్లాలోని 1,47,642 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు అధికారులు చర్యలు
- 110 కేంద్రాల్లో వేగంగా జరుగుతున్న స్టిచ్చింగ్ పనులు
- ఏక రూప దుస్తులను సకాలంలో అందిస్తాం : సుశీందర్‌రావు



రంగారెడ్డి, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : పాఠశాలల రీ ఓపెన్‌కు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉన్నది. బడులు తెరిచే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం దుస్తుల తయారీ బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అధికారులు అప్పగించారు. అయితే నిర్ణీత గడువు వరకు యూనిఫామ్స్ అందించేందుకు అధికారులు వారిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 1,264 పాఠశాలల్లో 1,47,642 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించనున్నారు. అయితే ఇప్పటివరకు 50 శాతం మాత్రమే దుస్తులు సిద్ధం కావడంతో యూనిఫామ్స్ అందజేతపై సందేహాలు నెలకొన్నాయి.

### ప్రతి ఒక్కరికీ రెండు జతల చొప్పున..

విద్యా సంవత్సరం ఆరంభం నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు ప్రతి విద్యార్థికి రెండు జతల చొప్పున దుస్తులు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకులాలు, కస్తూర్బాలు, మోడల్ స్కూల్స్, సంక్షేమ పాఠశాలలు మొత్తం కలిపి 1,264 ఉండగా.. వాటిలో చదువుతున్న 1,47,642 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు గతేడాది చివరలోనే అధికారులు కార్యాచరణను రూపొందించారు. దుస్తులను కుట్టే బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లోనే వారు పాఠశాలలకు వెళ్లి పిల్లల కొలతలు సైతం తీసుకున్నారు. అయితే యూనిఫామ్స్‌కు సంబంధించిన క్లాత్ గత నెల చివరన జిల్లాకు చేరడం.. దుస్తుల కటింగ్ మిషన్ల కొరత తదితర కారణాలతో గడువులోగా లక్ష్యాన్ని అందుకోవడం అధికారులకు సవాల్‌గా మారింది.

### 110 కేంద్రాల్లో కొనసాగుతున్న పనులు

దుస్తుల తయారీని మున్సిపాలిటీల్లో మెప్మా, రూరల్ ప్రాంతాల్లో డీఆర్డీఏ పర్యవేక్షిస్తున్నది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ పరిశీలిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో 39 సెంటర్లలో దుస్తుల కటింగ్ పనులు జరుగుతుండగా..110 కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులు స్టిచ్చింగ్ చేస్తున్నారు. డ్రెస్ మేకర్స్ కొరత వేధిస్తుండడం..దీనికితోడు రెండు జతల దుస్తులకు రూ.100 మాత్రమే చెల్లిస్తుండడంతో చాలామంది ముందుకు రావడం లేదు. అయితే ప్రభుత్వం ఆ మొత్తాన్ని పెంచే ఆలోచన కూడా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అక్కడక్కడా కుట్టుమిషన్ల కొరత ఉండగా..అధికారులు అప్పటికప్పుడు కొత్త వాటిని సమకూర్చుతున్నారు. ఆదివారం నాటికి యాభై శాతం దుస్తులు మాత్రమే సిద్ధమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి రోజూ వివిధ శాఖల అధికారులు పర్యవేక్షిస్తుండడంతో కొద్దిరోజులుగా దుస్తుల తయారీలో వేగం పుంజుకున్నది. అయితే హడావిడిగా దుస్తులను కుట్టడం వల్ల నాణ్యతాప్రమాణాలతోపాటు సైజుల విషయంలోనూ లోటుపాట్లు చోటు చేసుకుంటాయోనన్న ఆందోళన అధికార వర్గాల్లో నెలకొన్నట్లు తెలుస్తున్నది.

### సకాలంలో అందిస్తాం..



యూనిఫామ్స్ ఆదివారం నాటికి యాభై శాతం వరకు సిద్ధమయ్యాయి. చాలావరకు స్టిచ్చింగ్ పూర్తై చివరి దశలో ఉన్నాయి. అధికారుల నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నది. ఓ పక్క దుస్తుల తయారీతోపాటు మరోపక్క విద్యార్థులతో ట్రయల్ రన్ కూడా సాగుతున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్కూల్ తెరిచే నాటికి విద్యార్థులకు డ్రెస్సులను అందజేస్తాం.

-సుశీందర్‌రావు, రంగారెడ్డి డీఈవో

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లాలో 55,692 మంది అభ్యర్థులకుగాను 41,774 హాజరు..

వికారాబాద్ జిల్లాలో 5,468కిగాను ఎగ్జామ్ రాసిన వారు 4,277

# సజావుగా గ్రూప్-1 ప్రిలిమ్స్

రంగారెడ్డి, జూన్ 9 (నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం సజావుగా జరిగింది. రంగారెడ్డి జిల్లాలో 55,692 మంది అభ్యర్థులకుగాను 41,774(75.01శాతం) మంది పరీక్ష రాయగా.. 13,918 మంది గైర్హాజరు కాగా..వికారాబాద్ జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 5,468కిగాను 4,277 మంది పరీక్ష రాయగా.. 1,191 మంది గైర్హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని ఆరు పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన 7 స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య ఆయా రూట్ల వారీగా ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగగా.. ఎగ్జామ్ ముగిసిన అనంతరం అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా సీల్ వేసి తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కోటిరెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అధికారులు ముందస్తుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడంతోపాటు పరీక్షా కేంద్రాల వద్ద సమగ్ర వివరాలు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికారయంత్రాంగం చేపట్టిన చర్యల ఫలితంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా ప్రిలిమ్స్ పరీక్ష ముగిసింది.

### పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు..

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంజయ్‌గాంధీ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాలతోపాటు బాలాపూర్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలోని కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో సాయిడెంటల్ కళాశాల, శ్రీఅనంత పద్మనాభ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లోని కేంద్రాలను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. విశ్వభారతి డిగ్రీ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగడిలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ , పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఎస్పీ కోటిరెడ్డి సందర్శించారు. కాగా వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాలకు 12 మంది, విశ్వభారతికి నలుగురు, గౌతమి కళాశాలకు నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని పరీక్షా కేంద్రాల్లోకి అధికారులు అనుమతించలేదు. ఇరువురు కలెక్టర్లు అభ్యర్థులు, సిబ్బంది హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయో-మెట్రిక్ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రాథమిక చికిత్స వసతులతో కూడిన ఏఎన్ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా? లేదా! అని పరిశీలించారు.



హాల్‌టికెట్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు





వరద నివారణకు

# 542 అత్యవసర బృందాలు

శాశ్వతంగా వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల తొలగింపు

వర్షం పడినప్పుడు ఉద్యోగులను ఒకేసారి పంపించొద్దు

ఐటీ కంపెనీలకు బల్దియా అధికారుల సూచన




సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం నేపథ్యంలో వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వరద నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. ముఖ్యంగా వరద నీరు నిలిచే (వాటర్ స్టాగ్నేషన్) పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు వరద నీటిని తొలగించి నివారణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అగ్నిమాపకశాఖ, వాటర్‌వర్క్స్, పోలీస్, విద్యుత్‌శాఖల సమన్వయంతో గ్రేటర్‌లో వరదల నివారణ, విద్యుత్, రవాణా వ్యవస్థలతో ప్రజలకు సమస్య లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రేటర్‌వ్యాప్తంగా 542 మాన్‌సూన్ అత్యవసర బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### 125 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు

జీహెచ్ఎంసీ, ఇతర శాఖలతో కలిపి మొత్తం 542 అత్యవసర బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల సభ్యులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నివారణ చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు. గ్రేటర్ వ్యాప్తంగా 125 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు ఉండగా వాటిలో దశల వారీగా తగ్గిస్తూ శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం 32 వాటర్ లాగింగ్ పాయింట్లను కూడా వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

### వ్యర్థాలు వేయకుండా..

నాలాలో ప్రజలు చెత్త, వ్యర్థాలు వేయకుండా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వర్షాల సందర్భంగా వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షం పడినప్పుడు ఐటీ కంపెనీలు..తమ సిబ్బందిని ఒకే సమయంలో పంపించకుండా తగిన విడుతల వారీగా పంపించాలని సూచించారు. అదే విధంగా ఇతర కంపెనీలు, కార్యాలయాలు కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని, ప్రజలు కూడా అత్యవరమనుకుంటేనే బయటకు రావాలన్నారు. డ్రైనేజీ మూతలు ఓపెన్ చేయకూడదని, వర్షాకాలంలో ప్రజలకు వరద సమస్యలు ఎదురైనప్పుడు బల్దియా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు.

గ్రూప్-1 పరీక్ష రాసి వస్తూ..

# మృత్యు ఒడిలోకి..

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి



సుమిత్రాబాయి (ఫైల్)

ధారూరు, జూన్ 9 : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసి ఇంటికి తిరిగి వెళ్తూ బైక్ పై నుంచి కింద పడి పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ధారూరు పోలీసుల కథనం ప్రకారం.. బొంరాస్‌పేట మండలంలోని దేవులనాయక్‌తండాకు చెందిన సుమిత్రాబాయి (32) యాలాల మండలంలోని అచ్యుతాపురం గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు భర్త నెహ్రూనాయక్‌తో కలిసి బైక్‌పై వికారాబాద్‌కు వెళ్లింది. ఎగ్జామ్ అనంతరం తాండూరుకు తిరిగి వెళ్తుండగా గట్టేపల్లితండా సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ పై నుంచి కిందపడడంతో తలకు తీవ్రమైన గాయాలై మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

### దేవులనాయక్‌తండాలో విషాదం

బొంరాస్‌పేట : ధారూరు మండలంలోని గట్టేపల్లితండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొట్లవానితండా పంచాయతీ పరిధిలోని దేవులనాయక్‌తండాకు చెందిన సుమిత్రాబాయి మృతి చెందడంతో తండాలో విషాదం నెలకొన్నది. సుమిత్ర కుటుంబంతో కలిసి తాండూరులో ఉంటూ.. అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులకు హాజరవుతున్నది. ఆదివారం జరిగిన గ్రూప్-1 పరీక్షకు భర్తతో కలిసి వికారాబాద్‌కు బైకుపై వెళ్లింది. తిరిగి తాండూరుకు వస్తుండగా గట్టేపల్లితండా సమీపంలో బైకుపై నుంచి ఆమె కింద పడడంతో తీవ్ర గాయాలై మృతిచెందింది. భర్త నెహ్రూనాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నెహ్రూనాయక్ బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే కొడంగల్ తాలూకా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు దేశ్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు తాండూరు దవాఖానకు వెళ్లి నెహ్రూనాయక్‌ను పరామర్శించారు.

# కంటి తుడుపుగా..పచ్చదనం

ఈ ఏడాది 30.81 లక్షల మొక్కలతోనే సరి..

- గ్రేటర్‌లో పచ్చదనం పెంపుపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను
- కేసీఆర్ హయాంలో 8 సార్లు హరితహారం నిర్వహణ
- ఏటా కోటి మొక్కల పెంపకం
- నగరానికి ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్ ఘనత
- మహానగర పరిధిలో 147 శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం



సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో పచ్చదనం పెంపుపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. కంటితుడుపు చర్యగా ఈ ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం 30.81 లక్షల మొక్కలతో ముగించాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలాఖరులోగా పచ్చదనం పెంపునకు ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చి అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్న దరిమిలా.. ఈ మేరకు జీహెచ్ఎంసీ గ్రీనరీ పెంపునకు నామ మాత్రంగా చర్యలు చేపట్టడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 8 సార్లు హరితహారం ద్వారా ప్రతి ఏటా గ్రేటర్‌లో కోటి మొక్కలను నాటారు. ఖాళీ స్థలాల్లో యాదాద్రి మోడల్ మియవాకి, వర్టికల్, థీమ్ పార్కులు, మెరిడియన్ , అవెన్యూ ప్లాంటేషన్, జంక్షన్ సుందరీకరణ ట్రీ పార్కులు వంటి పేర్లతో పచ్చదనం, సుందరీకరణ పనులను చేపట్టారు. కాలనీలను పచ్చదనంతో నింపేశారు. ఫలితంగా హైదరాబాద్ మహా నగర పరిధిలో 147 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. గతంలో 33.15 చదరపు కిలోమీటర్లు అటవీ విస్తీర్ణం ఉండగా, బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం తర్వాత అటవీ విస్తీర్ణం 81.81 స్క్వేర్ కిలో మీటర్లకు పెరిగినట్లు ఎఫ్ఎస్ఐ (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) ప్రకటించింది. ఎఫ్ఎస్ఐతో పాటు అర్బోర్ డే ఫౌండేషన్ సంస్థ, ఎఫ్ఏఓ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యూఎన్) సంస్థలు 2020 సంవత్సరానికిగాను హైదరాబాద్ నగరాన్ని ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్‌గా గుర్తించాయి. 63 దేశాలకు చెందిన 119 పట్టణాలు, నగరాలు ఈ పోటీలో పాల్గొనగా, హైదరాబాద్ నగరానికి ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్ ఘనత దక్కింది. పచ్చదనం పెంపునకు బీఆర్ఎస్ సర్కారు పెద్ద పీట వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీనరీ పెంపుపై చిన్నచూపు చూడటం పట్ల పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. గ్రేటర్‌లో పచ్చదనం పెంపునకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు.

గ్రేటర్‌లో పచ్చదనం పెంపునకు

### నిర్దేశిత లక్ష్యాలు

| జోన్ | టార్గెట్ |
|---|---|
| ఎల్బీనగర్ | 6,62,610 |
| చార్మినార్ | 4,22,190 |
| ఖైరతాబాద్ | 4,48,500 |
| శేరిలింగంపల్లి | 6,15,000 |
| కూకట్‌పల్లి | 5,80,125 |
| సికింద్రాబాద్ | 3,53,400 |